
# ఆశ్రయం

డాక్టర్ బి.ఎస్.ఎన్. మూర్తి



**ప్రముఖ సాహితీవేత్త గండభేరుండంగారంటే నాకెంతో గౌరవం. ఆయన దాదాపు డజను నవల్లూ, మూడువందల కథలూ రాసి సాహితీలోకానికి ఎంతో మేలు చేశారు. అభ్యుదయ రచయితగా ఆయనకెంతో గుర్తింపు ఉంది. ఆయన రచనలకు పాఠకుల్లో విశేషాదరణ ఉంది.**

మా మొదటి పరిచయం ఆయన పేషెంటు, నేను డాక్టరుగా అయినా, తర్వాత మేమిద్దరం మంచి సాహితీమిత్రులుగా మారిపోయేం. నేను అడపాదడపా పత్రికల్లో కథలు చదువుతూ ఉంటాను. వాటిలోని సాహితీ విలువలు అంచనా వేస్తుంటాను. అందుకే ప్రత్యేకించి ఏ సాహితీ విశేషాలయినా ఆయన నాతో ముచ్చటిస్తూ ఉంటారు.

తెల్లటి పైజామా, తెల్లటి లాల్చీ, దళసరి కళ్లద్దాలూ, వయసు దాదాపు యాభైయ్యేదు ఉంటాయి. జీవితాన్ని బాగా మథించి చూసిన వాడిలా చూపులూ - ఆయన్ని చూస్తే ఎవరికైనా గౌరవభావం కలుగుతుంది.

ఆ రోజు సాయంత్రం క్లినిక్‌లో కూర్చుని పేషెంట్ల ని చూడ్డం పూర్తయింది. అప్పుడే వచ్చారాయన.

"రండి, కూచోండి!" అన్నాను సాదరంగా ఆహ్వానిస్తూ.

ఆయన కూర్చున్నారు. "నా కథ 'ఆశ్రయం' ఈ వారం పత్రికలో అచ్చు యింది, చూశావా?" అనడిగారు.

"అలాగా! నేను చూడనేలేదు. కథ ఏమిటి?" అన్నాను ఉత్సాహంగా.

"కొంచెం జ్వరం తగిలింది. ముందుచూడు, తర్వాత మాట్లాడుకుందాం!" అన్నారు.

"సిస్టర్! కొంచెం టెంపరేచర్ చూడు!" అని పిలిచాను. నర్సు వచ్చి థర్మామీటరు గండభేరుండంగారి నోట్లో పెట్టింది. ఆయన అది నోట్లో ఉంచుకుని ఆమెవంక పరీక్షగా చూశారు.

ఆమె థర్మామీటరు తీసి చూసింది. 'నూరు డిగ్రీలు' అంది.

తర్వాత ఆయన్ను పరీక్షచేసి మాత్రలు ఇచ్చాను. మూడుపూటలా వేసుకోమన్నాను.

ఆయన మాత్రలు జేబులో పెట్టుకున్నారు. నర్సు ఆ గదిలోనుండి వెళ్లిపోయింది. ఆమెవంక పరీక్షగా చూస్తూ అన్నారు "ఈమెను ఇంతకు ముందు ఇక్కడ కాకుండా ఇంకెక్కడో చూసి నట్టున్నాను"

"చూసి ఉండొచ్చు. మరో హాస్పిటల్లో పని చేసేది. ఈమధ్యనే నా దగ్గర చేరింది!" అన్నాను.

"అలాగా!" అన్నారాయన సాలోచనగా.

'ఇంతకూ మీ కథ గురించి చెప్పారు కాదు!'

అన్నాను.

"అవును, నీకు చెప్పాలి. ఆ కథకు ఇన్స్పిరేషన్ రైల్వేస్టేషనులో జరిగిన ఒక సంఘటన." ఆయన గొంతు సవరించుకుని మళ్లీ చెప్పసాగేరు.

* * *

ఒకసారి నా స్నేహితుడు రామానుజం నాతో నాలుగురోజులు గడుపుదామని హైదరాబాదు నుండి వచ్చాడు. అతడు తిరిగి వెళ్లేటప్పుడు రైలెక్కి ద్దామని స్టేషనుకు వెళ్లాను. మేము ట్రెయిన్ టైము కు పావుగంట ముందరే వెళ్లినా అది అరగంట లేటని తెలిసింది. కబుర్లతో కాలక్షేపం చేస్తూ అక్కడే సిమెంటు బెంచీ మీద కూర్చున్నాము.

ఈలోగా ఒక బిచ్చగాడు వచ్చి చెయ్యి చాపేడు. రామానుజం జేబులో నుండి రెండు రూపాలయనోటు ఒకటి తీసి వాడి చేతిలో పెట్టాడు. వాడు సంతోషంగా సలాము చేసుకుంటూ వెళ్లిపోయాడు.

నేను మా వాడిని అడిగాను - "వాడికి ఆకలి సమస్య రోజూ ఉంటుంది. నువ్విచ్చిన రెండు రూపాయలతో వాడి సమస్య పరిష్కారమవుతుందా?"

వాడు అన్నాడు - "పరిష్కారమవదు. కానీ ఈ రోజుకు ఆకలి తీరుతుంది కదా!"

"మరి రేపు?"

"వాడికి రేపు అన్నది రేపటిప్రశ్న. రేపు నాలాగే మరెవడో దానంచేస్తాడు."

"వాడికి దానంచేసి వాడిని అడుక్కునేందుకు నువ్వు ప్రోత్సాహపరుస్తున్నావు. కాదా?" అన్నాను.

రామానుజం చెప్పాడు - "వాడిని అడుక్కునేందుకు ప్రోత్సాహపరచడం నా ఉద్దేశం కాదు. ఈ రోజు వాడి ఆకలితీరడమే నా ఉద్దేశం" అంటూ కాసేపాగి మళ్లీ అన్నాడు - "నువ్వు కథల్లో అడుక్కునేవాళ్లు లేని కొత్తసమాజం కోసం రూపకల్పన చేస్తూ రాస్తున్నావు. ఆదర్శసమాజం కోసం కృషిచేస్తున్న ఆదర్శ రచయితగా మంచి పేరు ప్రఖ్యాతులు గడించావు. ఈ బిచ్చగాడిని చూసి నవసమాజంకోసం కావలిస్తే మరో కథ రాసి నీ బాధ్యత తీరిపోయిందని చేతులు దులిపేసుకోగలవు. అదే నీ జీవితధ్యేయం అనుకుంటున్నావు. కానీ ఈ వ్యవస్థలో ఒక్క అభాగ్యుడినైనా ప్రాక్టికల్‌గా నువ్వాదుకున్నావా? బహుశా లేదు అనుకుంటాను."

అతడు ఇంకా చెప్పసాగాడు. "నేను ఏ కథలూ రాయను. ఏ ఆదర్శాల గురించీ ఎక్కువగా ఆలోచించను. కానీ నేనో పేద విద్యార్థికి నెలనెలా ఇంత తిండీ, బట్టా,నెలనెలా ఫీజూ వగైరాలు సమకూరుస్తున్నానని నీకు తెలుసా? అభ్యుదయం గురించి కథలు రాసే నువ్వు ఎప్పుడైనా క్రియాశీలతతో కూడిన అటువంటి పని ఒక్కటైనా చేశావా?"

అతడు సూటిగా ఆవేశంతో అన్న మాటలు నాలో ఆలోచనల్ని రేకెత్తిం చాయి. అవును వాడు చెప్పింది నిజమే. నేను ఆదర్శరచయితనే కానీ, ఆదర్శజీవిని కాను. ఏదో ఒక మంచిపని అర్జంటుగా చెయ్యాలి. రచయితల ప్రపంచానికి మార్గదర్శకుడనవ్వాలి... ఇలా అనుకుంటూ ఉండగా రైలు వచ్చింది.

రామానుజాన్ని రైలు ఎక్కించాను. అది కొద్ది క్షణాల్లోనే బయలుదేరింది. అది కనుమరుగయ్యేదాకా ప్లాటుఫారంమీదనే నిలబడ్డాను. తర్వాత ఇటు తిరిగానో, లేదో అక్కడ ఓ బిచ్చగత్తె నిలబడి ఉంది. "బాబూ! ధర్మం!" అంటూ చెయ్యి చాపింది. నేను జేబులో చెయ్యి పెట్టి చూసి, "నో ఛేంజ్!" అన్నాను. వెంటనే ఆమె ఏమందో తెలుసా?

"ఐ గాట్ ఛేంజ్, ఇఫ్ యు వాంట్" అంది. ఆమె ఇంగ్లీషులో మాట్లాడేసరికి ఆశ్చర్యపోయాను. అప్పుడు ఆమెను పరిశీలనగా చూశాను. వయస్సు ఇరవై ఏళ్లు ఉండొచ్చు. మాసిపోయిన బట్టలు, కోల మొహం, చింపిరిజుట్టుతో ఉన్నా అందంగానే ఉందనిపించింది.

"ఎంతవరకు చదువుకున్నావు?" అన్నాను.

## మానర్స్‌లో మనీ ఉంది



సభ్యతా, సంస్కారాలు పాటిస్తే స్నేహితులు పెరుగుతారన్న విషయం మనకందరికీ తెలును. ఆదాయం కూడా పెరుగుతుందంటారు దిలీప్ ఠాకూర్. మన భారదీయ పారిశ్రామికవేత్తలకు, అధికారులకు మర్యాదలు సరిగా తెలయని కారణంగానే మనకు రావలసిన విదేశీ పెట్టుబడులు దక్కకుండా పోతున్నాయని వాపోరాయన. మేటి వాణిజ్య పత్రిక 'బిజినెస్ ఇండియా'ను స్థాపించి, పలు సంవత్సరాలు సంపాదకత్వం నెరపిన ఆయన మాట కొట్టేయలేం కదా!

ఇండియానుండి పాకేజి టూరిస్టులు వస్తామంటే యూరోప్‌లో ఉన్న మంచి హోటళ్లు వద్దు పొమ్మంటారట. మన వాళ్లవల్ల వాళ్లకు రెగ్యులర్‌గా వచ్చేవాళ్లుకూడా పోతారని భయమట. ఇలాంటి ఇమేజ్ ఉన్న మనం విదేశస్తులను ఎలా ఆకర్షించగలుగుతాం? తాజ్‌మహల్, హిమాలయాలు, గోవా బీచ్ ఉండగానే సరా, వాటి చుట్టూరా ఖాండ్రించి ఉమ్ముతూ మనం తిరుగుతూ ఉంటే దగ్గరకు రావడానికి జంకరూ? రష్యాలో కమ్యూనిస్టు రాజ్యం కూలిపోయాక, విదేశాలతో వాణిజ్య అవసరాలు పెరిగాక రష్యన్ అధికారులకు, వ్యాపారస్తులకూ మర్యాదా, మప్పితం పనిగట్టుకుని నేర్పుతున్నారట! అలా నేర్చుకోవలసిన అవసరం మనకు లేదంటారా?

మనం నేర్చుకోవలసిన, పాటించవలసిన మర్యాదలేమిటో దిలీప్ ఠాకూర్ చెప్పినప్పుడు 'ఓస్, ఇంతే కదా!' అనిపిస్తాయి. గట్టిగా మాట్లాడవద్దని, వేళ్లతో భోజనం చేయవద్దని, పెద్ద పెద్ద ముద్దలు తినవద్దని, నమిలేటప్పుడు నోరు తెరవద్దని, పానీయాలు తాగేటప్పుడు చప్పుడు చేయవద్దని, వాష్ బేసిన్ దగ్గర పుక్కిలించవద్దనీ, గొప్పలు చెప్పకుండా సౌమ్యంగా మాట్లాడమని, కరకు నిజం కూడా చెప్పేటప్పుడు సున్నితంగా చెప్పమని - ఇలాంటివే. ఇవి కూడా మనవాళ్లు పాటించరంటే ఆశ్చర్యంగా తోస్తుంది కదూ!

ఈ మర్యాదలు పాటిస్తే డబ్బు ఎలా వస్తుందని తెల్లబోకండి. 'మీ రూల్స్‌కి అడ్డు రాకుండా ఉంటే, డిస్కౌంటు ఇచ్చే అవకాశం ఏదైనా ఉందేమో చూస్తారా?' అని మర్యాదగా అడిగి లక్షరూపాయలదాకా మిగుల్చుకున్న కేసులు చూశానంటాడు ఠాకూర్.

అంతెందుకు? మన పరిధిలోనే చూడండి. నాబోటి అమ్మాయి కౌంటర్లో కూచుందనుకోండి. కౌంటరు మూసేశాక, 'ఇవాళే టెండరుకు డబ్బు కట్టడానికి ఆఖరి రోజు. లేటయిపోయింది అనుకోకుండా కాస్త డబ్బు కట్టించుకుంటారా?' అని స్టైలిష్‌గా వచ్చి, పాలిష్డ్‌గా అడిగినవాడికి సరేనంటుంది. నోటినిండా పాన్ వేసుకుని నములుతూ, ఉమ్మి తుంపర్లు వెదజల్లుతూ, 'లేటయితే మాత్రం కట్టించుకోవచ్చుగా, మీకు గవర్నమెంటు వాళ్లు ఇంతింత జీతాలు ఇవ్వడం దండగ!' అంటూ వాదించేవాడిని పొమ్మంటుంది. మరి ఆ టెండరు వల్ల వచ్చే ఆదాయం ఈ పాన్ మసాలాగాడికి పోయినట్టేగా!

\- శిల్ప

"బి.ఏ." అంది.

"నీ పేరేమిటి?"

"విజయ" అంది ముక్తసరిగా.

"అలా చదువుకుని, ఇలా అడుక్కుంటున్నావేమిటీ?" అనడిగాను.

ఆమె కాసేపు ఏమీ సమాధానం చెప్పలేదు. తర్వాత అంది - "మా అమ్మా, నాన్నలు చిన్నప్పుడే పోయారు. విధిలేక పిన్నీ, బాబాయిల దగ్గర పెరిగే దాన్ని. కానీ వారుకూడా ఈమధ్య అకస్మాత్తుగా గతించడంతో, మరే జీవనాధారం లేక ఇలా ..." ఆమె కళ్ల వెంబడి నీళ్లు తిరిగాయి.

ఆమె మాటలకు నా హృదయం పిండేసినట్టయింది. ఆమెకు ఏదైనా సాయం చేద్దామనుకున్నాను. ఏమిటి సాయం చేస్తాను? ఆలోచించాను. చేసే సాయం నాకు గర్వంగా నలుగురికీ చెప్పుకునేదిలా ఉండాలి. ఆమెను మా ఇంటికి తీసుకువచ్చేస్తే? మిగతా కుటుంబసభ్యులతో పాటు ఆమె కూడా ఇంత తిండి తింటుంది. తర్వాత ఎలా జరిగితే అలా ... అలా అనుకుంటూ తాపీగా చెప్పాను - "నీకు ఆశ్రయం కల్పిస్తాను. మా ఇంటికి వచ్చేస్తావా? ఇంట్లో నలుగురితోబాటు నువ్వూ తిందువుగాని. నీకు ఇలా ఆకలి బాధలు ఉండవు."

అప్పుడామె నా వైపు సందేహంగా చూసింది. నా వ్యక్తిత్వాన్నే శంకిస్తున్నట్టు ఆ చూపుల్లో భావం.

ఆమెకు నేనెవరో చెప్పాను. "నువ్వు చదువుకున్నదానివి కదా! నా పేరు వినే ఉంటావు. నేను గండభేరుండం అని ఒక కథారచయితను."

"మీ పేరు విన్నాను కానీ, మీ రచనలు చదవలేదు" అంది.

"అయితే విను. నేను నూతన వ్యవస్థకోసం ఎన్నో కథలు రాశాను. కథలు రాసేస్తే ఈ వ్యవస్థ పట్ల నా బాధ్యత తీరిపోయిందని ఇన్నాళ్లూ భావిస్తూ వచ్చాను. కానీ ఈ రోజు నాభావనలో కొంచెం మార్పు వచ్చింది. ఈ వ్యవస్థలో నిస్సహాయులను ఆదుకోవడం కూడా రచయితలకు సామాజిక బాధ్యత అని గుర్తించాను. అందుచేత ఈ రోజు నీకాశ్రయమిచ్చి ఆచరణవాదినని లోకానికి చాటుకుంటాను. మిగతా రచయితలకు మార్గదర్శకుడనవుతాను!" అన్నాను.

ఈ మాటలు వింటూనే ఆమె నా వైపు నిర్వికారంగా చూసింది. తర్వాత వెళ్లిపోయింది.

ఆమె అలా వెళ్లిపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ సంఘటన నా మెదడులో కథకు జీవం పోసింది.

* * *

ఆయన చెప్పినదంతా ఓపిగ్గా విన్నాను. "మరా బిచ్చగత్తె సంఘటన కథా రూపంలో ఎలా పెట్టారు?" అడిగాను.

"ఎలానా?" అంటూ గండభేరుండంగారు చెప్పారు -

"ఒక అభాగ్యురాలు సంఘంలో స్థానంలేక ఈ వ్యవస్థమీద తిరుగుబాటు చేద్దామనుకుం టుంది. ఇంతలో సమాజంలో ఎక్కడినుండో ఆమెకు ఆకలిబాధలు లేకుండా సహాయం అందు తుంది. దాంతో ఈ జీవితమే బాగుందనుకుం టూ నూతనవ్యవస్థ నిర్మాణంపట్ల తనవంతు కర్తవ్యం మరిచిపోతుంది. ఈ సమాజం ఆమె కిచ్చిన ఆశ్రయం ఆమెను బాధ్యతారహితురాలిగా చేసింది - ఇది ప్లాటుగా కథ రాశాను."

ఒక్కక్షణం మాఇద్దరి మధ్య నిశ్శబ్దం ఆవరించింది. తర్వాత టేబులు మీదున్న కాలింగ్ బెల్ నొక్కాను.

నర్సుగదిలోకి వచ్చింది. ఆమెతో అన్నాను - "విజయా! మా ఇద్దరికీ రెండు టీలు తెప్పించు!"

గండభేరుండంగారు ఆమెనే పరీక్షగా చూస్తూ ఉండిపోయారు.

ఆమె వెళ్లాక ఆయన అన్నారు. "నిజం చెప్పు. నీ దగ్గర నర్సు రైల్వే స్టేషనులో ఆ బిచ్చగత్తే కదూ! పేరు కూడా విజయే అంటున్నావు. ఈమె నీ దగ్గరకి ఎలా వచ్చింది?"

నేను చెప్పాను. "ఆ రైల్వేస్టేషను విజయే ఈ విజయ. ఒకసారి జ్వరంతో స్పృహతప్పిపడిపోతే ఎవరో తీసుకువచ్చి నా హాస్పిటల్లో జాయిన్ చేసి వెళ్లిపోయారు. ట్రీట్మెంటుతో బాగా కోలుకుంది. కానీ ఈ విశాలప్రపంచంలో ఎక్కడికని తిరిగి వెళ్తుంది? ఆమె చదువుకున్నదని తెలుసుకున్న నేను 'నర్సు ట్రెయినింగ్ నేర్చుకుందువుగాని, ఇక్కడే ఉండిపో!' అన్నాను. ఆమె సంతోషంగా అంగీకరించి నా దగ్గర ఉండిపోయింది."

గండభేరుండంగారు సందేహంతో అడిగారు. "నువ్వు ఆశ్రయమిస్తానంటే నీ దగ్గర ఎందుకు ఉండిపోయింది? నేనా రోజు అంతగా ప్రాధేయపడినా రాలేదేం?"

నేను జవాబు చెప్పాను. "మీరు ఆమెకు కల్పిస్తానన్న ఆశ్రయం మీరో ఆదర్శవ్యక్తి అని లోకానికి చెప్పుకోవడం కోసం. జీవితాంతం 'ఈ బిచ్చగత్తెకు నేనాశ్రయం ఇచ్చాను' అని మీరు చాటుకోవడం ఆమె సహించలేదు. ఆమెకు కావలసింది జీవనోపాధి. వ్యక్తిగా సమాజంలో కొంత గౌరవం. అవి నా దగ్గర దొరికాయి. అందుకే ఆమె నా దగ్గర ఉండిపోయింది."

నా తర్కం ఆయన మస్తిష్కంలో తుఫాన్లు రేపుతున్నదని నాకు తెలుసు.

"ఇంతకుముందు ఆమె మరో హాస్పిటల్లో పనిచేసేదని నాతో చెప్పావెందుకు?" అన్నారు.

"పాతజీవితం ఆమెకు ఎవరూ ఏ పద్ధతిలోనూ గుర్తుచెయ్యకూడదని అబద్ధం చెప్పాను, సారీ!" అన్నాను.

ఇంతలో నర్సు రెండు టీలు పట్టుకొచ్చి టేబులు మీద పెట్టింది. గండభేరుండం గారికొక టీ ఇచ్చాను. నేనో టీ తీసుకున్నాను.

నేను నర్సుతో "విజయా! ఈయన నీకు తెలుసా? ..." అని ఏదో చెప్పబోతుంటే ఆమె అంది - "నాకు తెలుసు. గండభేరుండంగారని రైల్వేస్టేషను పరిచయం." మళ్లీ ఆయనవైపు చూసి అంది - "క్షమించండి, మిమ్మల్ని ఆ రోజు బాధపెట్టానేమో!"

గండభేరుండంగారు నవ్వుతూ అన్నారు - "బాధపెట్టడమా! ఎంత మాత్రమూ లేదు. నీవు చేసింది సరైన పనే!"

